నేటి దినపత్రిక సూర్య

బుధవారం
31 జనవరి
2024
పేజీలు 8

పల్నాడు జిల్లా


# గెలుపే లక్ష్యంగా... టీడీపీ వ్యూహాత్మక సామాజికం

- బీసీ నాయకత్వం కోసం మేధోమధనం
- బీసీ నేతలతో సాధికారక కమిటీలు
- పాత జిల్లా నుంచి 14 మందితో రాష్ట్ర కమిటీ
- ప్రతి పార్లమెంట్ జిల్లా నుంచి 14 మంది చొప్పున ఎంపిక
- 25 జిల్లానుంచి 14 మంది చొప్పున 350 మంది ఎంపిక
- బీసీ అధ్యక్షుడు కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో జయహో బీసీ

**నేటి దిన పత్రిక సూర్య బ్యూరో, పల్నాడు జిల్లా**

2024 సార్వత్రిక ఎన్నికలే ప్రధాన లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ వ్యూహాత్మక సామాజికాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది.ఆధునిక రాజీకీయం సామాజిక(కుల) వర్గాల వారీగా విడిపోయిన నేపథ్యంలో ఆ దిశగా అడుగులు వేసి వ్యూహాత్మకంగా తమ వైపు తిప్పుకునే భావనతో మోస్టు బ్యాక్ వర్డు క్లాస్ (ఎంబీసీ)సమావేశాలు నిర్వహిస్తుంది.ఆ పార్టీ బీసి ఫెడరేషన్ అధ్యక్షుడు కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో బీసీ వర్గాలకు చెందిన మేధోమధనం సమావేశాలను నిర్వహించడమే కాకుండా జిల్లా వారీగా జయహెూ బీసీ సభలను నిర్వహిస్తున్నారు. నెల రోజుల నుంచి నిర్వహిస్తున్న ఈ సదస్సులో సుమారు 56 కులాలతో సమావేశాన్ని నిర్వహించినట్లు సమాచారం అందుతోంది. పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ సూచన మేరకు నిర్వహంచిన సదస్సులో బీసీలలో మంచి నాయకత్వాన్ని తయారుచేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తుంది.అధికార వైసిపి నిర్వహిస్తోన్న సామాజిక బస్సుయాత్రకు ధీటుగా ఈ సభలను నిర్వహిస్తున్నారు.ఇదిలావుండగా, బీసీలలో కూడా కొన్ని సామాజిక వర్గాలే అన్నీ రకాలుగా లబ్ధి పొందుతున్నాయన్న భావనతో ఎంబీసీ కులాలు కూడా అన్నీ రకాల ప్రయోజనాలు పొందాలన్న భావనతో నెల రోజులలుగా వివిధ నియోజకవర్గాలలో ఆ పార్టీ బీసి ఫెడరేషన్ మిగతా 3వ పేజీలో



## నరసరావుపేట నియోజకవర్గంలో మారుతున్న సమీకరణలు



- వైసీపీకి ఎమ్మెల్యే గోపిరెడ్డి ఫిక్స్
- టీడీపీకి ఎవరో...?
- గోడమీద పిల్లిలా జనసేన



**నరసరావుపేట మేజర్ న్యూస్**

2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల సమీకరణలు మారుతున్నాయి. ఆశావాహులు, లాలింపులు ,బుజ్జగింపులు, ఫిరాయింపులు, వివిధ ఏజెన్సీల సర్వేల మధ్య రాజకీయ నాయకులు బిజీ అయ్యారు. వైసీపీలో అసమ్మతితో రెండు గ్రూపులు ఏర్పడినప్పటికీ సీఎం ఫేసీలో జరిగిన చర్చలు ఫలితంగా సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డికి ఆ పార్టీ తరపున పోటీ చేయించడానికి టికెట్ కన్ఫర్మ్ అయినట్టు తెలుస్తుంది. దాంతో సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి కి లైన్ క్లియర్ అయింది అని చెప్పవచ్చు. అయితే ఎమ్మెల్యే అ సమితి నేతలను కూడా తన వైపు తిప్పుకోవాలని ఆసమ్మతి నాయకుల ఇంటి వద్దకు వెళ్లి మిగతా 3వ పేజీలో

## " కన్నా" సమక్షంలో "దేశం" పార్టీలో చేరిన 25 మైనార్టీ కుటుంబాలు



సత్తెనపల్లి ప్రతినిధి, మేజర్‌న్యూస్

పల్నాడు జిల్లా,సత్తెనపల్లి నియోజకవర్గం,అధికార పార్టీ వైస్సార్సీపీ నుండి మాజీ మంత్రివర్యులు కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. సత్తెనపల్లి పట్టణంలోని 29వ వార్డులోని తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ సుభాని, షేక్ బాజీ, షేక్ ఫైనాన్స్ బాజీ, షేక్ నన్నే కర్రి ఆధ్వర్యంలో 25 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలోకి రావడం జరిగింది. వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి కన్నా లక్ష్మీనారాయణ సాదరంగా ఆహ్వానించారు. కన్నా మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ మైనార్టీలకు అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎల్లినేడి రామస్వామి, చౌటా శ్రీనివాసరావు, నాయకులు ఆతుకూరి నాగేశ్వరరావు, రాంబోబు డే, సయ్యద్ మహబూబ్, జానీ బాబు, దూద్ కె, బాబు, ముత్తినేని నరేంద్ర, పాల్గొన్నారు.

## ఆర్.ఎం.పి , పి.ఎం.పి యూనియన్ అధ్యక్షులు గా పాశం




వినుకొండ, మేజర్‌న్యూస్

పట్టణ గ్రామీణ ఆర్.ఎం.పి , పి.ఎం.పి వైద్యుల ఐక్యవేదిక స్థానిక ఎన్ఎస్పి కార్యాలయంలోని యూనియన్ కార్యాలయం నందు ఫిబ్రవరి 4వ తేదీ ఆదివారం విజయవాడలో రాష్ట్రంలోని ఆర్.ఎం.పి , పి.ఎం.పి వైద్యుల మహాసభ "చలో విజయవాడ" పోస్టర్ ను విడుదల చేసిన వినుకొండ యూనియన్ అధ్యక్షుడు పాశం నాగమల్లే శ్వర రావు, గౌరవ అధ్యక్షుడు కె. బ్రహ్మానందం . కార్యక్రమంలో ఎం. బ్రహ్మయ్య, షేక్ హుసేన్, రామలింగాచారి,గుంటూరు నుండి విచ్చేసిన రాష్ట్ర స్థాయి నాయకులు సత్తార్ ,వలి,శేషశాయి, మురళి కృష్ణ,,నరసింహారావు , నియోజకవర్గం, మండల నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ త్యాగరాజ స్వామి వారి ఆరాధన ఉత్సవాలు



వినుకొండ, మేజర్‌న్యూస్

ప్రముఖ కర్ణాటక సంగీత వాగ్గేయ కళాకారులు, నాదోపాసన ద్వారా భగవంతుని దర్శించిన సంగీత బ్రహ్మ శ్రీ త్యాగరాజ స్వామి వారి ఆరాధన ఉత్సవాలు వినుకొండ శ్రీ కోదండరామ స్వామి వారి దేవస్థానం ఆవరణలోని శ్రీ త్యాగరాజ స్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్ వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. త్యాగరాజ స్వామి వారి ఆరాధ్య దైవం శ్రీ సీతారామ చంద్రుల వారి పటము , శ్రీ త్యాగరాజ స్వామి వారి పటంతో ఉదయం నగర సంకీర్తన, శ్రీ త్యాగరాజ స్వామివారి విగ్రహానికి అభిషేకము, విశేష అర్చన నిర్వహించి పూలమాలలు సమర్పించారు.పరిషత్ కార్యకర్తలు, భక్తులు, మహిళా సత్సంగ సభ్యులవారు హనుమాన్ చాలీసా పారాయణతో పాటు, ప్రత్యేక భజనలు, భక్తి పాటలతో స్వామివారిని ఆరాధించి, తదుపరి భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో త్యాగరాజ స్వామి ఆలయ అనువంశిక ధర్మకర్త శ్రీ చందలూరి సుబ్బారావు, కోటా మల్లికార్జునరావు విశ్వహిందూ పరిషత్ నాయకులు శ్రీ భాగవతుల రవికుమార్, గజవల్లి నాగ పవన్ కుమార్, కొలిశెట్టి సుబ్బారావు, గుడిపాటి బాల రావు, గోనుగుంట్ల ఘంటారావు, భవనాసి సాంబశివరావు, కంచర్ల భద్రయ్య, పూజారి చంటి, శ్రీమతి కోట రాజేశ్వరి భక్తబృందం, తదితరులు పాల్గొన్నారు.

# గొప్ప నాయకత్వ పటిమ ఉన్న మహెూన్నత వ్యక్తి పూజ్య బాపూజీ







సత్తెనపల్లి ప్రతినిధి, మేజర్‌న్యూస్

ప్రపంచలోనే అహింసా మార్గంలో దేశ స్వాతంత్ర్యం సముపార్జన గొప్ప నాయకత్వ పటిమ ఉన్న మహెూన్నత వ్యక్తి పూజ్య బాపూజీ,జాతిపిత మహాత్మాగాంధీ అని పట్టణ ఆర్యవైశ్య సంఘ నాయకులు పేర్కొన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం సత్తెనపల్లి పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు మద్ది వెంకటే శ్వరరావు ఆధ్వర్యంలో పట్టణంలోని మాతృశ్రీ మొల్లమాంబ అనాధ వృద్ధుల ఆశ్రమంలో తొలిగా గోమాతకు మేతను అందించి, అనంతరం వృద్ధులకు అల్పాహారం పంపిణీ చేశారు. గాంధీ చౌక్ లో ఉన్న గాంధీ గారి విగ్రహానికి పూలమా లలు వేసి నివాళు లర్పించారు. అనంతరం అక్కడ ఉన్న విగ్రహాలకు పూల మాలలు వేసినారు. ఈ కార్యక్రమములో కొత్త లక్ష్మయ్య, జవ్వాజి రామమో హనరావు, పెరుమాళ్ళ లక్ష్మీ శివన్నారాయణ, దేవతి సుబ్బారావు, కాపుగంటి రత్తయ్య, దూప గుంట్ల జానకీ రామారావు, దివ్వెల శ్రీనివాసరావు, కొత్త రామకృష్ణ, దేవతి శివప్రసాద్,యక్కల సుబ్బారావు, చిలకల శ్రీనివాసరావు, బాలనాగు శివ కోటేశ్వరరావు, బాలనాగు నాగేశ్వరరావు, దేవరపల్లి కాశీ, చలువాది హరికుమార్, కాకర్ల రమేష్, సయ్యద్ ఖలి నాయకులు పాల్గొన్నారు.

**వాసవి క్లబ్ ఫ్యామిలీస్, ఆధ్వర్యంలో....**

పూజ్యా బాపూజీ, జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా వాసవి క్లబ్ ఫ్యామిలీస్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి, వడ్డవల్లి పోలేరమ్మ గుడి వద్ద గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అడిషనల్ వైస్ గవర్నర్ ఆత్మకూరి వెంకట హరే రామ చెంచయ్య, ఆర్యవైశ్య సంఘం మహిళా మండలి అధ్యక్షురాలు జవ్వాజి లక్ష్మి, బోండా వెంకటేశ్వరరావు, కోట వెంకట బసవయ్య, గజవల్లి బాజీ, రవి స్టూడియో హరినాథ్, చంద్రపాటి సునీత, పెరుమాళ్ళ సతీష్ నాయకులు పాల్గొన్నారు.

**వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ....**

వినుకొండ మేజర్ న్యూస్: మహాత్మా గాంధీ 76వ వర్ధంతి కార్యక్రమం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వినుకొండ వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ మహాత్మునికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు మహాత్ముని ప్రాణత్యాగం ఎంతో చాలా బాధాకరం వారి మరణం మన అందరికీ చాలా బాధాకరం అని ఈ సందర్భంగా మహాత్ముని అడుగుజాడలలో ఆదర్శవంతమైన అహింస మార్గంలో కులమతాల తారతమ్యం లేకుండా ప్రతి వ్యక్తి కూడా సమాజ అభివృద్ధికి తోడ్పడాలని వాసవి క్లబ్ అధ్యక్షులు అచ్యుత మోహనరావు ఉద్ఘాటించారు ఈ సందర్భంగా పలువురు వ్యక్తులు ప్రసంగిస్తూ మహాత్ముని సేవలను కీర్తించారు రీజనల్ చైర్మన్ పొత్తూరి రాము మాట్లాడుతూ గాంధీ చూపించిన అడుగుజాడలలో నడవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రీజనల్ సెక్రటరీ చలంకూరి కోటేశ్వరరావు మాజీ డిప్యూటీ గవర్నర్ బెల్లంకొండ ప్రసాద్ ఇంటర్నేషనల్ వైస్ గవర్నర్ గడ్డుపల్లి శ్రీనివాస్ గజవల్లి పవన్ పేరూరి కృష్ణ మండల కిరణ్ గుడిపాటి చంద్ర ఇంటర్నేషనల్ మల్టిపుల్ డైరెక్టర్ కజయం విజయలక్ష్మి వైస్ గవర్నర్స్ జవ్వాది సువర్ణ లక్ష్మి దేవతి శైలజ అనిల్ అప్పలరాజు పచ్చి పులుసు రామాంజనేయులు రత్నాకర్ అలానే వాసవి మల్టిపుల్ కపుల్స్ అధ్యక్షులు పువ్వాడ సుబ్రహ్మణ్యం సన్ శక్తి లక్ష్మీనారాయణ జివిఎల్ నాగేశ్వరరావు మోటమర్రి నరసింహారావు పల్నాడు జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షులు గుడివాడ గురునాథం మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేష్ కన్నా కొత్త మాసు శివ డాల్ మిల్స్ అధ్యక్షులు కన్నెగండ్ల కోటేశ్వరరావు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దివ్య పుల్లారావు వాసవి యువజన నాయకులు ఇమ్మడిశెట్టి వెంకటేష్ అన్న మల్లికార్జున్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ కి ఘనమైన నివాళులర్పించిన మాజీ మంత్రి "కన్నా"



సత్తెనపల్లి ప్రతినిధి, మేజర్‌న్యూస్

"జాతిపిత మహాత్మా గాంధీ" వర్ధంతి సందర్భంగా సత్తెనపల్లి పట్టణంలోని మాజీ మంత్రివర్యులు "కన్నా" క్యాంపు కార్యాలయం వద్ద గల తెలుగుదేశం పార్టీ ప్రజా వేదిక ప్రాంగణంలో "మహాత్మా గాంధీ" చిత్రపటానికి, పట్టణంలోని గాంధీ చౌక్ వద్దగల "గాంధీ" విగ్రహానికి పూల మాలలు వేసి కన్నా లక్ష్మీనారాయణ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చౌటా శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ చైర్మన్, రాష్ట్ర కార్యదర్శి యేల్లినేడీ రామస్వామి, మాజీ మున్సిపల్ వైస్- చైర్మన్ ఆతుకూరి నాగేశ్వరరావు, జనసేన నాయకులు రాడ్లు శ్రీనివాసరావు, జాన్ బాబు, గుజ్జర్లపూడి సతీష్, సీతయ్య,ఆళ్ల సాంబయ్య, కొమ్మటినేని శ్రీనివాసరావు, ఆళ్ల అమరేశ్వర రావు,దివ్వెల శ్రీనివాసరావు, యేల్లినేడీ లక్ష్మీ తులసి, కంబాల వెంకటేశ్వర్లు, కొండా, పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు, తెలుగుదేశం-జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



గురజాల, మేజర్‌న్యూస్

గురజాల శ్రీ పాత పాటమ్మ వారి దేవాలయంలో ప్రతి మంగళవారం వచ్చు భక్తులకు వృద్ధులకు అనాధలకు యాచకులకు స్మైల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం కొనసాగుతుంది. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం అన్నదాన కార్యక్ర మం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గురజాల ఎస్సై అశోక్ బాబు పాల్గొని వారి చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమానికి గురజాల నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త కటకం అంకారావు తమ సహాయ సహకారాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్సై అశోక్ బాబు మాట్లాడుతూ అన్ని దానాల కంటే అన్నదానం చాలా గొప్పదని స్మైల్ ఫౌండేషన్ వారు పట్టణంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఈ సందర్భంగా ఆయన ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు. కటకం అంకారావు మాట్లాడుతూ పౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్మైల్ ఫౌండేషన్ ను అభినందించి, ఆదరించాలని అన్నారు. గత సంవత్సరం నుంచి అనేక కార్యక్రమాల నిర్వహిస్తూ, కరోనా విపత్తులో నిత్యవసర వస్తువుల పంపిణీ,ప్రతి మంగళవారం అన్నదాన కార్యక్రమం, గురజాల తిరణాళ్ళలలో అమ్మవారి ప్రతిమల పంపిణీ ,ఫౌండేషన్ ద్వారా మహిళలకు చీరలు పంపిణీ చేపట్టి, అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో స్మైల్ ఫౌండేషన్ అధ్యక్షులు గుండా కాశీ విశ్వనాథం, ఉపాధ్యక్షులు బండి రవి ,షేక్ అజీస్, హనుమంతరావు, షరాబు లింగేశ్వరరావు, నేరెళ్ల సాంబశివరావు, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

## దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు చేసిన మేయర్



**గుంటూరు, మేజర్ న్యూస్ :** గుంటూరు నగరంలోని నగరంపాలెం జి.టి.రోడ్డు నందు గల శ్రీ హజరత్ కాలే మస్తాన్ షా అవులియా దర్గా 132వ ఉరుసు మహోత్సవం సందర్భంగా దర్గాను సందర్శించి,ఉరుసు మహోత్సవంలో పాల్గొని స్వామి వారికి ఛాదర్ (వస్త్రం) సమర్పించి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి తదుపరి భక్తులకు అన్నదానం చేస్తున్న గుంటూరు నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు. ఈ కార్యక్రమంలో దర్గా ధర్మకర్త రావి రామ్మోహన్ రావు, కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, గేదెల నాగరంగమణి రమేష్, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, పార్టీ నాయకులు కంతేటి శ్యాం శేఖర్, టెంట్ హౌస్ బాబు, కామిశెట్టి మధు, మత పెద్దలు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

### నరసరావుపేట నియోజకవర్గంలో
## మారుతున్న సమీకరణలు

(మొదటి పేజీ తరువాయి)

బుజ్జగింపులు చేస్తున్నట్టు సమాచారం. తెలుగుదేశం పార్టీ పరిస్థితి అయోమయంగా ఉందని చెప్పవచ్చు. ఆ పార్టీలో నరసరావుపేట నియోజకవర్గ ఇన్చార్జిగా డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు కొనసాగుతున్నారు. ఈయన గత పది సంవత్సరాలుగా పార్టీ కోసం తన ఆస్తులను తెగ నమ్మి పోషిస్తూ వచ్చారు. అయితే ఆ పార్టీలో చంద్రబాబు నాయుడు సామాజిక వర్గానికి చెందిన మరికొందరు టిక్కెట్ ఆశిస్తూ గ్రూపు రాజకీయాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థిని ప్రకటించడంలో సందిగ్ధంలో పడిందని చెప్పవచ్చు. దానికి ప్రధాన కారణంగా ప్రస్తుతం నియోజకవర్గ ఇన్చార్జిగా కొనసాగుతున్న డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ఒక బీసీ సామాజిక వర్గానికి చెందిన వాడనే చిన్న చూపు అధిష్టానంలో ఉన్నదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అదేవిధంగా చదలవాడకు పల్నాడు ఫైర్ బ్రాండ్ గా పేరు పొందిన డాక్టర్ కోడెల శివప్రసాదరావు తో పోలిస్తే సరి తూగ లేదని నియోజకవర్గంలో చర్చ నడుస్తుంది. ఇప్పుడున్న రాజకీయాల్లో అతి మంచితనం పనికిరాదనే నానుడి కారణంగా ఆయన వైఫల్యం అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉంటే తెలుగుదేశం పార్టీ టిక్కెట్ కన్ఫర్మ్ చేయడంలో అధిష్టానం పాప కింద నీరులా వ్యవహరిస్తుంది. జనసేన పార్టీతో పెట్టుకున్న పొత్తు కారణంగా రాష్ట్రవ్యాప్తంగా కొన్ని సీట్లు జనసేనకి తెలుగుదేశం పార్టీ కేటాయించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నరసరావుపేట టికెట్టు జనసేనకి కేటాయించే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతుంది. ఇక జనసేన విధి విధానాన్ని ఒకసారి పరిశీలిస్తే నరసరావుపేట నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్న సయ్యద్ జిలాని ఎప్పుడు జనంలో ఉన్న దాఖలాలు లేవు. ప్రభుత్వంపై చేసిన విమర్శలు అసలే లేవు. నియోజకవర్గ సమస్యలపై పోరాటం చేసిన సంఘటనలు లేవు. నియోజకవర్గంలో కనీసం 20వేల ఓట్లు సాధించలేని అభ్యర్థికి టికెట్ కేటాయిస్తే కచ్చితంగా వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీ ఏమి నిర్ణయం తీసుకుంటుంది అని నియోజకవర్గ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## గెలుపే లక్ష్యంగా.. టిడిపి వ్యూహాత్మక సామాజికం

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షుడు కొల్లు రవీంద్ర పర్యవేక్షణలో జరుగుతోన్న మేదో మధనం వర్కుషాపులో అనేక అంశాలను పరిగణలోకి తీసుకుని పునశ్చరణ తరుగుతులు నిర్వహించారు. బీసీలో రాష్ట్రంనుంచి ఒక బలమైన నాయకత్వాన్ని తయారు చేయాలన్న భావనతో అనేక కమిటీలకు రూపకల్పన చేశారు.ఆ కమిటీలకు సాధికారక కమిటీలుగా నామకరణం చేసినట్లు తెలుస్తుంది.

**14 మందితో రాష్ట్ర కమిటీ :** రాష్ట్రం అన్నీ అంశాలను పరిగణలోకి తీసుకుని నాయకత్వ లక్షణాలు మెండుగా ఉన్న అనేక మందిని ఎంపిక చేసి వారిని కమిటీలోకి తీసుకుంటున్నారు. రాష్ట్ర కమిటీని ఆర్గనైజ్ చేస్తున్న కొల్లు రవీంద్ర ఉమ్మడి 13 జిల్లాల నుంచి ఒక్కొక్కరిని తీసుకుని మొత్తం 14 మందితో రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేస్తున్నారు.

**పార్లమెంటుకు జిల్లా కమిటీలు ఏర్పాటు :** బిసీలనే లక్ష్యంగా చేసుకుని లీడర్‌ను తయారు చేయాలన్న భావనతో ఉన్న టిడిపి ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఒక జిల్లా కమిటీని ఎంపిక చేస్తున్నారు. వీటిలో పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇద్దరు చొప్పున సభ్యులను ఎంపిక చేసి జిల్లా కమిటీని తయారు చేస్తారు. ఈప్రకారం 25 జిల్లాలకు 14 మంది చొప్పున సుమారు 350 మంది సాధికార కమిటీ సభ్యులను ఎన్నుకుని వారి కనుగుణంగా పార్టీ కార్యక్రమాలు రూపొందిస్తున్నారు.

### మర్రిచెట్టుపాలెం గ్రామంలో
# “బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ”



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** రొంపిచర్ల మండలం మర్రిచెట్టుపాలెం గ్రామంలో నరసరావు పేట నియోజకవర్గ టీడీపీ ఇన్-చార్జ్ డాక్టర్ చదలవాడ అరవింద బాబు “బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ” పేరిట ఇంటింటికి తిరుగుతూ టీడీపీ, జనసేన మేనిఫెస్టో ప్రతులను పంచారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తే అమలు చేసే సూపర్ ఫిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నరసరావుపేట అభివృద్ధి కాకుండా గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శని గ్రహములా దాపురించారని ఎమ్మెల్యే పదవిని అడ్డుపెట్టుకొని నరసరావుపేట అభివృద్ధి నిధులను దోచుకుంటున్నారని అరవింద బాబు ఆరోపించారు. గోపిరెడ్డి పాలనలో నరసరావుపేట అభివృద్ధిలో నాలుగు తరాలు వెనుకకు నెట్టివేయబడిందని సహజ వనరులను పూర్తిగా వైసీపీ గుండాలు దోచుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.జాతి సంపదగా ఉండవలసిన సహజ వనరులు వైసీపీ గుండాల సంపదగా మార్చుకున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ భూములను ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి చరపట్టారని గోపిరెడ్డిని ఓడించి భూతల్లిని చెర నుండి విడుదల చేయాలని, భూమిలేని పేదలకు పంచి పెట్టడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రభుత్వ భూములే కాకుండా సొంత వైసిపి నేతల ఆస్తులపై కూడా గోపిరెడ్డి కన్ను పడిందని విలువైన భూములన్ని సొంతం చేసుకోవడానికి గోపిరెడ్డి హత్య రాజకీయాలకైనా వెనుకాడనన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిని చూస్తే వ్యక్తిగత ఆస్తులు సంపాదించుకున్న వైసిపి నేతలు సైతం వనికి పోతున్నారని ఎద్దేవా చేశారు.మళ్లీ గెలిపిస్తే గోపిరెడ్డి భూపాకాసురుడై భూములన్ని మింగేస్తారని గోపిరెడ్డి ధనదాహానికి సామాన్యుల సైతం బలి అవుతారని అరవింద బాబు చెప్పుకొచ్చారు.అక్రమ ఆస్తులు కూడా పెట్టి 16 నెల జైలు పక్షి జగన్ రెడ్డి నాయకత్వంలో పని చేసే అవినీతి,అక్రమాలకు కొమ్ము కాసే ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని ఓడించి అభివృద్ధికి ముని నారా చంద్రబాబు నాయుడిని గెలిపించాలని ప్రజలను కోరారు. చంద్రబాబు నరసరావుపేట ప్రజల పై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలని టీడీపీ అధికారంలోకి వస్తే నరసరావుపేటను అభివృద్ధి పథంలో నడిపించడానికి సైనికుడిలా పని చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు పులుకురి జగయ్య,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, శాఖమూరి రామ్మూర్తి,సైదులు రెడ్డి,కొలికొండ కొండలు, జల్లిపల్లి శేషమ్మ, కనుమూరి లక్ష్మి, టీడీపీ, జనసేన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులను బదిలీ చేయాలి : డాక్టర్ చదలవాడ



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట నియోజకవర్గంలో గత కొన్ని సంవత్సరాలుగా స్థాన చలనం లేకుండా పని చేస్తున్న పోలీస్ అధికారులు,ప్రభుత్వ ఉద్యోగులను బదిలీ చేయాలని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-చార్జ్ డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. మంగళవారం ఈ మేరకు జిల్లా కలెక్టర్ శివశంకర్ కు వినతి పత్రం అందజేశారు. ఎన్నికలు దగ్గర పడుతున్నాయని వచ్చే ఎన్నికల సమయానికి పోలీస్ అధికారులను, ప్రభుత్వ ఉద్యోగులను బదిలీ చేయాలని లేకపోతే వారు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తారని ఫిర్యాదులో పేర్కొన్నారు.పోలీస్ అధికారులను ప్రజాస్వామ్య బద్దంగా, ఎన్నికల నియమావళిని అనుసరించి బదిలీ చేయాలని అలా బదిలీ చేయకపోతే ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేస్తామని అధికారులను హెచ్చరించారు.ఎన్నికల సమయం నాటికి అన్ని ప్రభుత్వ శాఖల్లో పని చేసే ప్రభుత్వ ఉద్యోగులను బదిలీ చేయాలని ఎన్నికల నియమావళి చెప్తుంటే నరసరావుపేటలో సంవత్సరాల తరబడి స్థానా చలనం లేకుండా పని చేస్తున్న పోలీస్ అధికారులను మార్చకపోవడం దేనికి సంకేతమన్నారు.ఎన్నికల సమయం నాటికి ప్రభుత్వ ఉద్యోగులందరినీ బదిలీ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేల్పుల సింహాద్రి యాదవ్,మాజీ ఎంపీపీ కడియం కోటి సుబ్బారావు,మాజీ కౌన్సిలర్ కొవ్వూరి బాబు,తెలుగు యువత నాయకులు శాఖమూరి మారుతి,షేక్ నాగూర్, చల్లగుండ్ల హరికృష్ణ,నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు షేక్ మాబు,వార్డ్ ప్రెసిడెంట్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## హైమాస్ట్ లైట్ ప్రారంభించిన మేయర్





**గుంటూరు, మేజర్ న్యూస్ :** గుంటూరు నగరంలోని లిఆర్.అగ్రహారం శ్రీ వెంకటేశ్వరస్వామి గుడి వద్ద నుండి రామనామక్షేత్రం గుడి వరకు గల రోడ్డు నగర పాలక సంస్థ అధ్వర్యంలో ఎంతో ప్రతిష్టత్మకంగా చేపట్టిన రోడ్డు విస్తరణ, రోడ్డు నిర్మాణం, సెంట్రల్ డివైడర్ మరియు సెంట్రల్ లైటింగ్ వంటి పనులలో భాగంగా వెంకటేశ్వరస్వామి దేవస్థానం సెంటర్ నందులి ఏర్పాటు చేసిన హై మాస్ట్ లైట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని,ప్రారంభించి తదుపరి సదరు అదే ప్రాంతంలో మేయర్ గారి అధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న 16అడుగుల ధ్యాన శివుని భారీ విగ్రహాన్ని శాస్త్రోక్తంగా త్వరలో ప్రారంభించడానికి సంబంధించి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న గుంటూరు నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, తేలుకుట్ల హనుమాయమ్మ యోగేశ్వరరావు, స్థానిక నాయకులు కంతేటి శ్యాం శేఖర్, ఖాజా మొహిద్దిన్,టెంట్ హౌస్ బాబు, పల్లపు దుర్గాప్రసాద్, పల్లపు మహేష్, కామిశెట్టి మధు, సోమి కమల్, స్థానిక పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## నేటి దినపత్రిక సూర్య క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ముడేల

**పిడుగురాళ్ల రూరల్ మేజర్ న్యూస్ :** పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో నేటి దినపత్రిక సూర్య నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ముడేల వెంకటేశ్వర రెడ్డి. ఈ కార్యక్రమానికి పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సూర్య రిపోర్టర్లు వడ్లమూడి శ్రీనివాసరావు, అనంతుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



# గతంలో ఎన్నడు లేని విధంగా 'గురజాల' అభివృద్ధి: వైకాపా నాయకులు




- గురజాలలో నేడు వైఎస్ఆర్ ఆసరా చెక్కులు పంపిణీ
- పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం
- అభివృద్ధి కేరాఫ్ 'గురజాల'
- మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

గురజాల, మేజర్‌న్యూస్

గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా గురజాల నగర పంచాయతీని అభివృద్ధి చేశామని నగర పంచాయతీ చైర్పర్సన్ పోలు పవన్ మై వీరారెడ్డి అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా నగర పంచాయతీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి వైకాపా నాయకులు పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేదల అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా పాలన సాగిస్తున్నారని, అందుకు నిదర్శనమే గురజాల నియోజకవర్గ అని, గురజాల శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి పట్టుదలతో పులివెందులతో పోటీ పడి గురజాల నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని అన్నారు. బుధవారం శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి చేతుల మీదుగా నగర పంచాయతీ పరిధిలో జగనన్న ఆసరా చెక్కులు, అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, మహనీయుల విగ్రహాల ప్రారంభోత్సవాలు జరగనున్నాయని,ఈ కార్యక్రమాలకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని, అనంతరం జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైస్ చైర్ పర్సన్ లు బడేజానీ, మన్నెం ప్రసాద్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాలు ఒకసారి గురజాల నియోజకవర్గం వచ్చి జరిగిన అభివృద్ధిని చూసి కళ్ళు తెరుచుకోవాలని అన్నారు. రాబోయే రోజుల్లో ఎవరు చేయలేని విధంగా గురజాల నగర పంచాయతీని అభివృద్ధి చేశామని, గత ప్రభుత్వంలో ప్రజలు తాగే మంచినీటి చెరువులో చేపలు పెంచి సొమ్ము చేసుకున్న తెలుగుదేశం పార్టీని..... రెండున్నర కోట్ల రూపాయలతో సుందరంగా చేసిన దుబా చెరువు అభివృద్ధి ప్రజలందరూ గమనించాలని కోరారు. ప్రజలందరికీ మంచి చేసిన ప్రభుత్వాన్ని మరోసారి ప్రజల ఆశీర్వదిం చాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, పట్టణ కన్వీనర్ కుక్క మూడి అన్నారావు, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, కౌన్సిలర్లు బండి రవి, సుభాని, నాయకులు చల్లా కాశి బాబు, జక్కా సత్యం, కనకం ఆదినారాయణ దత్తు పాల్గొన్నారు.

# ఆకుకూరలతోనే ఆరోగ్యం



నరసరావుపేట, మేజర్‌న్యూస్

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆకుకూరలు తినటం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని పల్నాడు జిల్లా డిపిఎం అమల కుమారి అన్నారు. మంగళవారం పల్నాడు జిల్లాలోని అల్లూరు వారి పాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించినటువంటి ఆకుకూరలను జిల్లా అగ్రికల్చర్ అడ్వైజర్ బోర్డు సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులకు అందించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ శివ శంకర్ ఆకుకూరల ప్రాధాన్యత గురించి మాట్లాడారు . అందులోనూ పురుగు మందులు లేకుండా ప్రకృతి వ్యవసాయ విధానములో పండించినటువంటి ఆకుకూరలు అమృతంతో సమానమని, ఈ ప్రకృతి వ్యవసాయ విధానంలో ప్రతి ఒక్కరు కూడా ఆకుకూరలు కూరగాయలు పెరటి తోటలు పెంపకంలో పండించుకుని తినటం ద్వారా అందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలియజేయడం జరిగినది. అమల కుమారి అల్లూరు వారి పాలెం లో ఆకుకూరలే కాకుండా కూరగాయలు పలు రకాల ప్రకృతి వ్యవసాయ విధానంలో మోడల్స్ వేసి అందరికీ అమృతము లాంటి ఆహారం అందజేస్తూ ఉన్నారు కనుక,ప్రతి ఒక్కరు కూడా ప్రకృతి వ్యవసాయ విధానంలో ఉన్న ఈ మోడల్స్ ను వేసుకొని వంట ఇంటికి అవసరమైన అన్ని ఆకుకూరలు కూరగాయలు వారే పండించుకుని తినడం వలన మనము అనారోగ్యాలకు దూరంగా ఉంటామని మంచి ఆరోగ్యాన్ని పొందుతామని అందరికీ తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమం లో ఏ ఏ బి ఛైర్మన్ కె. సాయి మారకుండా రెడ్డి, డి ఏ ఓ ఐ మురళీ , కృషి విజ్ఞాన సీనియర్ శాస్త్రవేత్త యం గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

# వాసవి క్లబ్ ఆధ్వర్యంలోశ్రీరామమూర్తికి ఘన సన్మానం



మాచర్ల టౌన్, మేజర్‌న్యూస్

వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో ఏపీయూడబ్ల్యూజే మాచర్ల నియోజకవర్గం అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన వాసవి క్లబ్ సభ్యులు కొత్త మాసు శ్రీరామమూర్తి ని ఘనంగా సత్కరించి మేమెంటును బహుకరించారు. ఈ సందర్భంగాక్లబ్ అధ్యక్షులు ఓరుగంటి చెన్నకేశవరావు, మాట్లాడుతూ శ్రీరామమూర్తి సేవా భావం కలిగిన వ్యక్తిని, ఆయన ఎన్నో పదవులు పొందాలని కోరారు. రిపోర్టర్, గా చేరి మాచర్ల సమస్యలపై వార్తలు రాసి మంచి పేరు తెచ్చుకున్నారని, ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలోకార్యదర్శి పంది రీనరసింహారావు, కోశాధికారి చుండూరు సత్యనారాయణ, రీజయన్ చైర్మన్ మేడం నాగేశ్వరావు, వాసవి క్లబ్ జిల్లా ఆఫీసర్స్ పోలిశెట్టి పిచ్చయ్య, తిరువీధుల వెంకట వెంకట నాగేశ్వరావు, మేడా వెంకటలక్ష్మి, పరిటాల ధనలక్ష్మి, నిడమనూరు లక్ష్మి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# జగన్ ఎన్ని కుట్రలు చేసినా బాబు వెంటే ప్రజలు



వినుకొండ, మేజర్‌న్యూస్

అధికార దుర్వినియోగంతో జగన్ రెడ్డి అండ్ కో మచ్చలేని చంద్రబాబు నాయుడు పై ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసిన రాష్ట్ర ప్రజలు బాబు వెంటే ఉన్నారని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో చంద్రబాబు నాయుడు పై పెట్టిన అక్రమ కేసులో ఎదురుదెబ్బ తగిలిందని సుప్రీంకోర్టు తీర్పు జగన్ రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు అని అన్నారు. సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలకు జగన్ రెడ్డి, వైసీపీ నాయకులు సిగ్గుపడాలని అన్నారు. నిజం గెలవడానికి ఆలస్యం కావచ్చు కానీ అంతిమంగా నిజం గెలుస్తుందని వాస్తవాన్ని జగన్ రెడ్డి అర్థం చేసుకోవాలని హితోపలికారు. ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఎన్నో వైఫల్యాలు ఉన్నాయని అన్నారు. జగన్ రెడ్డి అసమర్థ పాలనతో రాష్ట్రం 13 లక్షల కోట్లు అప్పుల ఊబిలో కూరుకు పోయిందన్నారు. దేశంలో మహిళలపై నేరాల్లో ఏపీ ఆరవ స్థానంలో ఉందని, ప్రతిరోజు కనీసం 70 కేసులు నమోదయి తున్నాయని, నేలలో వరకట్నం వేధింపులు అత్యా చారం, ఆత్మహత్య, లైంగిక వేధింపులే ముఖ్యంగా ఉంటున్నాయని వివరిం చారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో రైతుల రుణభారం పెరిగిందన్నారు. అనేక పథకాలను నిలిపివేయడంతో పాటు చంద్రన్న బీమా ,వ్యవసాయ రాయితీలు ,విదేశీ విద్యతో పాటు 100 పథకాలను తొలగించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి వైఫల్యాలను గుర్తించి తన ఓటమిని ఇప్పటికే ఒప్పుకున్నారని "వై నాట్ 175"అనే వ్యక్తి ఇటీవల ఇండియా టుడే ఇంటర్వ్యూలో ఓడిపోయిన తప్పులేదని అనడం ప్రజలకు అర్థమైందని అన్నారు. వైసీపీపై అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఇప్పటికే పార్టీని వెళుతున్నారని, పార్టీ మీద వైసిపి నాయ కులపై వ్యతిరేకత ఉందని కారణంతో ఒక సీటు నుంచి మరో సీటుకు మార్చుకుంటున్నారని కానీ రాష్ట్ర ప్రజలు జగన్ రెడ్డిని మార్చేందుకే సిద్ధంగా ఉన్నారని అన్నారు. నరసరావుపేట వైసిపి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు లోక్సభకు వైఎస్సార్సీపీకి రాజీనామా చేయడం జరిగిందన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి వైసిపికి రాజీనామా చేయడం జరిగిందని వివరించారు. వైసీపీలో బీసీలకు అన్యాయం జరుగుతుందని కర్నూలు ఎంపీ సందీప్ కుమార్, జగన్ రెడ్డి పై వ్యతిరేకతతో మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రాజీనామా చేయడం జరిగిందన్నారు. అరాచక జగన్ రెడ్డి పాలనతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయి వైసిపిని ఇంటికి పంపేందుకు సిద్ధమయ్యారని ఆయన స్పష్టం చేశారు. టిడిపి జనసేన సంయుక్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే వెనుకబడిన తరగతుల బీసీల కోసం ప్రత్యేక రక్షణ చట్టం ప్రవేశపెడుతుందని, ఏపీ భూమి పట్టాదారు చట్టం రద్దు చేపడుతుందని, అన్యాక్రాంతమైన భూములను యజమా నులకు అప్పగించేందుకు సిట్ ఏర్పాటు చేయడం జరుగు తుందని, 18 ఏళ్లు నిండిన మహిళలకు మహాశక్తి పథకం కింద ఆడబిడ్డ నిధిగా నెలకు 1500, దీపం పథకం కింద సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేయడం జరుగుతుందని ఇలా అనేక ప్రజా సంక్షేమ పథకాలు తీసుకువచ్చి ప్రజలను ఆదుకోవడం జరుగుతుం దన్నారు.

# సమస్యలపై గలమెత్తిన అధికారపక్ష సభ్యులు




సత్తెనపల్లి ప్రతినిధి, మేజర్‌న్యూస్

తమ వార్డుల్లో నెలకొని ఉన్న సమస్యలపై అధికారపక్ష సభ్యులు గల మెత్తారు... దీంతో అధికారులు ఒక్కసారిగా కంగుతిన్నారు.. సమాధానం చెప్పలేక తట పటాయించారు. ఈ విచిత్రమైన సంఘటన సత్తెనపల్లి పురపాలక సంఘంలో మంగళవారం చోటు చేసుకుంది. ఇక వివరాల్లోకి వెళితే... సత్తెనపల్లి పురపాలక సంఘం కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్మన్ చలంచర్ల లక్ష్మీ తులసి అధ్యక్షతన జరిగింది. ఎజెండాలో పేర్కొన్న 11 అంశాలను సభ్యులకు చదివి వినిపించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ మామిడి మేరీ గ్రేస్ పలు అంశాల గురించి వివరణ అడిగారు. దీనికి కమిషనర్ కొలిమి షమ్మి సమాధానమిచ్చారు. ఇంతవరకు బాగానే ఉంది. ఇక అధికార పక్షానికి చెందిన అవ్వారు శ్రీనివాసరావు, కూకట్ల లక్ష్మి లు తమ వార్డులో శానిటేషన్ అధ్వానంగా మారిందని లేవనెత్తారు. దోమలు ఉధృతికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కనీసం ఫాగింగ్ చేయించాలని విజ్ఞప్తి చేశారు. తమ వార్డులో రెండు బాత్రూం నిర్మించాలని గత రెండు సంవత్సరాలుగా విజ్ఞప్తి చేస్తూనే ఉన్నానని లక్ష్మీ వాపోయారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని కమిషనర్ వివరణ ఇచ్చారు. స్మశానం వద్ద నిర్మాణాలకు 14 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని రెండేళ్లుగా చెబుతూనే వస్తునే వున్నారు. కానీ పనులు ఎక్కడా ప్రారంభించిన దాఖలు లేవని కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు వాపోయారు. నిధులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని కమిషనర్ చెప్పారు. 15వ వార్డులో మంచినీటి సరఫరా సక్రంగా జరగడంలేదని దీనిపై చర్యలు తీసుకోవాలని వార్డ్ కౌన్సిలర్ పేర్కొన్నారు. వార్డుల్లో నెలకొని ఉన్న పారిశుద్ధ్య పనులను వెంటనే పూర్తి చేయాలని, కాలువలో పేరుకుపోయిన మురుగును వెంటనే తొలగించి శానిటేషన్ పనులను పూర్తిస్థాయిలో చేపట్టే విధంగా చర్యలు గైకొనాలని కౌన్సిలర్లు, కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. గత రెండు నెలలుగా ఇదే పరిస్థితి వార్డుల్లో నెలకొని ఉందని, అధికారులు స్పందించడం లేదని కౌన్సిలర్లు వాపోయారు. అధికార పక్షానికి చెందిన కౌన్సిలర్లు తమ వార్డుల్లో నెలకొని ఉన్న సమస్యలపై ప్రశ్నల వర్షం కురిపించడంతో... సమాధాన పరిచేందుకు కమిషనర్ షమ్మీ తట పటాయించారు. కల్వర్టులు నిర్మించి ఆరు మాసాలు కాకముందే మురుగు నీరుపారుదలకు అవి ఏమాత్రం ఉపయోగపడడం లేదని లక్ష్మి వాపోయారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగి కొత్త శ్రీనివాసరావు, అధికారుల వద్ద కూర్చొని రాజకీయాలు చేస్తున్నారని, ఆయనపై అనేక ఆరోపణలు ఉన్నాయని, తక్షణమే చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆరోపణలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ సమాధానమిచ్చారు. ఈలోగా అచ్యుత శివప్రసాద్ లేచి అజెండాలోని అంశాలన్నింటికీ సభ్యులు మద్దతు ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో సమావేశాన్ని ముగిస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ -చైర్మన్లు షేక్ నాగుల్ మీరాన్, కోటేశ్వరరావు నాయక్, సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆటోనగర్‌కి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బొల్లా





వినుకొండ మేజర్‌న్యూస్

20కోట్ల విలువైన స్థలాన్ని ఆటోనగర్‌కి అందిం చామని, రానున్న రోజుల్లో ఆటోనగర్‌ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి తీరుతానని వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండ మార్కాపురం రోడ్ లోని డాలర్ సెట్టింగ్ పక్కన వినుకొండ మేకనిక్స్ కోసం 470మంది సభ్యులతో కూడిన ప్రగతి మోటార్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు 10 ఎకరాల స్థలాన్ని కేటాయి చ్చారు. కేటాయించిన స్థలంలో మంగళవారం భూమి పూజ ఏర్పాట్లు చేశారు.ఆటో నగర్ భూమి ఏర్పాటుతో ఆటో నగర్ కార్మికులు విజయోత్సవ సభ ఏర్పాటుచేశారు. ఈ సభ కార్యక్రమానికి ముందు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడుని వినుకొండ పట్టణం భారీ బైక్ ర్యాలీతో ఆటో నగర్ స్థల వేదిక వద్దకు తీసుకువచ్చారు. ర్యాలీలో బాగంగా చెక్ పోస్ట్ సెంటర్‌లో ఎమ్మెల్యే స్వాగతం పలుకుతూ కేర్ సహాయం తో గజ మాలనుతో సత్కరించారు. అనంతరం ఆటో నగర్ స్థలంలో వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు, అసోసియేషన్ అధ్యక్షులు గంట సుభాని కార్యవర్గ సభ్యులు మరికొందరు ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు.అనంతరం ప్రత్యేకంగా సర్వమత ప్రార్ధనలు చేశారు. ఏర్పాటు చేసిన వేదికపై వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ఆటోనగర్ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాన్ని నిరబెట్టుకున్నానని తెలిపారు.ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని, అయితే మరో హామీని ఇస్తూ కార్మికులను ఆనందపరిచారు, రానున్న రోజుల్లో ఆటోనగర్ ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని విద్యుత్తు డ్రైనేజ్ భవనాల నిర్మాణం తదితర మౌలిక వసతులు ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తారని బరో ఇస్తూ పది ఎకరాలకు సంబంధించిన ఆటోనగర్ స్థలం రిజిస్ట్రేషన్ ను యూనియన్ అధ్యక్షులు గంటా సుభాని కార్యవర్గ సభ్యులకు కార్మికుల సమక్షంలో అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఘనంగా సత్కరించి అభినందించారు. లారీ యూనియన్ కు సైతం ఆరు ఎకరాల స్థలాన్ని కేటాయించమని తెలిపారు.మండలం ఎంపీపీ జయ శ్రీ వెంకటరామిరెడ్డి, వినుకొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి యాదవ్ ,మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, వినుకొండ పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు 26 వార్డ్ కౌన్సిలర్ గంట కాలేశా, సీనియర్ న్యాయవాది ఏజీపీ ఎమ్ ఎమ్ ప్రసాద్ ,ప్రగతి మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ గంటా సుభాని సెక్రెటరీ కాజా ట్రెజరర్ షరీఫ్ జాయింట్ సెక్రెటరీ బాజీ, మోటర్ వర్కర్స్ పాల్గొన్నారు.





## యువత మహాత్మా గాంధీ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలి

వినుకొండ మేజర్‌న్యూస్:

యువత మహాత్మాగాంధీ ఆశయ సాధనకు, ఆలోచనలకు అనుగుణంగా ముందుకు సాగాలని పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుడివాడ చిన్న గురునాథం అన్నారు.మహాత్మా గాంధీ 76వ వర్ధంతి వేడుకలు ఆర్యవైశ్య సంఘం అధ్యర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహిం చారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు గుడివాడ చిన్న గురునాథం పూలమా లవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ తెల్లాకుల రాజేష్ ఖన్నా, ఆర్యవైశ్య సంఘ నాయకులు మోటమర్రి నరసింహా రావు, సన్నీశెట్టి లక్ష్మీనారాయణ,దివ్వెల పుల్లారావు, అడ్డగిరి జగదీష్,మద్ది శ్రీనివాసరావు, గజవల్లి పవన్ కుమార్, మండవ కిరణ్ కుమార్, సుబ్రహ్మణ్యం, గట్టుపల్లి శ్రీనివాసరావు, గుడిపాటి చంద్రశేఖర్, కన్నెగండ్ల కోటేశ్వరరావు, ఖాజ్జయం విజయలక్ష్మి, ఇమ్మాడిశెట్టి వెంకటేష్ కన్నెగండ్లపవన్ పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీజీకి ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే కాసు



పిడుగురాళ్ల రూరల్ మేజర్‌న్యూస్:

జాతిపిత మహాత్మా గాంధీజీ వర్ధంతి సందర్భంగా పట్టణ వైఎస్సార్సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించిన ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చింత వెంకట రామారావు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎండి గఫార్, కొటారు నరసింహారావు, జూలకంటి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కొక్కెర శ్రీనివాసరావు, గర్రె నాగేశ్వరరావు,వైఎస్సార్సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పైసలిస్తే పెట్టాలిచేస్తారు....?

గురజాలలో ఖరీదైన భూమి హంఫట్....?

రెవిన్యూ కార్యాలయంలో ఒక అధికారి లీలాలు...

22 సెంట్లు ఒక వ్యక్తికి రాసించిన వైనం

ఉన్నత అధికారులకి తెలుసా... తెలీదా అని చర్చికుంటున్న ప్రజలు

మరో రెండు రోజుల్లో ఆ అధికారి బదిలీ పై వెళ్లే అవకాశం

ఆన్లైన్లో కుంట భూమి తీసేయాలా...చేయి తడపాల్సిందే

గురజాల, మేజర్‌న్యూస్ :



అది ఖరీదైన ప్రభుత్వ స్థలం...పేదల ఇళ్ల పట్టాలకు, ప్రభుత్వ కార్యాలయలకు అనువుగా ఉండే స్థలం కానీ ఒక రెవిన్యూ అధికారి ధన దాహం వల్ల కొందరు వ్యక్తులకు సొంత ప్రయోజనాల కోసం అప్పనంగా రాసించిన సంఘటన గురజా లలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణ ప్రజలు చర్చించుకుంటున్న దాని ప్రకారం రెవిన్యూ కార్యాలయంలోని ఒక ప్రభుత్వ ఉద్యోగి మరో రెండు రోజుల్లో బదిలీ కానుండడంతో అధికార పార్టీకి చెందిన నాయకులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవలే అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులకు పోరంబోకు భూములు, అసైన్డ్ భూములు అర్ధరాత్రి వరకు కార్యాలయంలో ఉండి సదరు నేతల పేర్లు మీద రాయించుకున్నట్లు సమాచారం.

పైసలిస్తే పెట్టాలిచేస్తారు....?




మండల పరిధిలో కొందరు నాయకులకు ఆయా గ్రామాల్లో ప్రభుత్వ స్థలాన్ని సదురు అధికారికి చేతులు తడిపి తమ బినామీల పేర్లు రాయించు కునారనే అనే వార్తలు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది. పట్టణంలో 22సెంట్ల ఖరీదుఅయినా భూమిని కొందరు నాయకుల బినామీల పేర్లతో రాసినట్లు సమాచారం. ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకు నామమాత్రంగా పనిచేస్తున్న అధికారి.... సాయంత్రం ఐదు గంటల నుండి రాత్రి 12 గంటల వరకు బిజీ బిజీగా పని చేస్తున్నట్లు ఆ కార్యాలయంలో చర్చించుకుంటున్నారు. మరో రెండు రోజుల్లో బదిలీ అవతారనే ప్రచారం జరుగుతుండడం తో వచ్చిన కాడికి దండుకుందామనే ఆలోచనలో ఆ అధికారి ఉన్నట్లు తెలుస్తుంది. అర్ధరాత్రి వరకు అధికార పార్టీకి చెందిన నాయకులు ఆ కార్యాల యంలోనే కనిపిస్తున్నారు.

## బ్రాహ్మణపల్లిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ



పిడుగురాళ్ల రూరల్ మేజర్‌న్యూస్

నారా చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండ లంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో 7వ వార్డులో బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం టీడీపీ మండల మహిళ అధ్యక్షురాలు పి వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగింది. బాబు షూరిటీ – భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి,పథకాల గురించి మహిళలకు వివరిస్తూ టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు భవిష్యత్తు గ్యారంటీ, ప్రతి సంక్షేమ పథకానికి మహిళలను అర్హులను చేస్తూ తగిన గౌరవం చంద్రబాబుతో సాధ్యమవుతుందన్నారు. మహిళ, రైతు, యువత, వెనుకబడిన తరగతుల సాధికారత, బలోపేతంతో పాటు ఇతర సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలతో పేదలను ధనికులుగా తీర్చిదిద్దటానికి చంద్రబాబు ప్రకటించిన తొలి ఏజెండా భవిష్యత్తు గ్యారెంటీ మ్యానిఫెస్టో గురించి ప్రజలకు తెలియపరచడానికి, ప్రజ లను చైతన్యవంతం చేసి, 2024లో టీడీపీ అధికారంలోకి వచ్చాక భవిష్యత్తుకు గ్యారెంటీలోని వాగ్దానాలను ఎటువంటి వివక్ష లేకుండా, నిబంధనలు విధించకుండా అమలు చేయడంతో పాటు మన రాష్ట్ర అభివృద్ధికి పాటుపడడానికి చంద్రబాబు నాయుడు కృషి చేస్తారని, ప్రతి ఒక్కరూ భవిష్యత్తుకు గ్యారెంటీ – ఇది బాబు గ్యారెంటీ కార్యక్ర మంలో భాగస్వామ్యులు కావాలంటే నమోదు చేయించుకోవా లని సూచించారు.గ్రామంలో ఇంటింటికి తిరిగి భవిష్యత్తు గ్యారెంటీ మ్యానిఫెస్టో ప్రతి ఒక్కరికి వివరించి,2024లో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావడానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని, చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రిగా చెయ్యాలని,తద్వారా రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ప్రజలను కోరుతూ, రానున్న 5 సంవత్సరాలలో టీడీపీ ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీలోని సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి ఎంత ఆదాయం అందబోతుందో ప్రతీ ఒక్కరికి వివరించారు. టీడీపీ మం డల మహిళా అధ్యక్షురాలు పివెంకటరమణ, పాదర్తి రాజేశ్వరి, నాగూర్ బి,కాటూరు కళ్యాణి, ఉప్పల అరుణ కుమారి, మామిడాల పార్వతి,టీడీపీ కార్యకర్తలు, మహిళలు,అభిమానులు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్న ప్రభుత్వమిది..ఆశీర్వదించండి

- ఓటు అడిగే హక్కు ఒక్క జగన్మోహన్ రెడ్డికే ఉంది
- రాష్ట్రంలో రూ 2,570 కోట్లు రుణమాఫీ ద్వారా మహిళల ఖాతాల్లోకి నగదు జమ
- నాలుగో విడతలో నియోజకవర్గంలో 4572 గ్రూపులకు రూ. 37.87 కోట్ల లబ్ది







సత్తెనపల్లి రూరల్, మేజర్‌న్యూస్
ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నాలు గు విడతలలో డ్వాక్ర రుణమాఫీ చేసి....మాట నిల బెట్టుకున్న ప్రభుత్వాన్ని ..మహిళలు ఆశీర్వదిం చాలని రాష్ట్ర జలవనరుల శాఖామాత్యులు అంబటి రాంబాబు అన్నారు. సోమవారం వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో జరిగిన పట్టణ ,రూరల్ మండలాల పొదుపు సంఘాల ఆసరా వారోత్సవాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా అక్కచెల్లెమ్మలకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మంత్రి అంబటి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు గత ఎన్నికల సమయంలో రైతు, డ్వాక్రా రుణమాఫీ చేస్తానని మాట ఇచ్చి హామీని చెత్తలో పడేసి దుర్మార్గపు పాలన చేశారని విమర్శించారు. ఒక్క జగన్మోహన్ రెడ్డి మాత్రం ఇచ్చిన మాట మేరకు రూ25750 కోట్లను డ్వాక్రా రుణమాఫీ చేసి అక్క చెల్లెమ్మల వద్ద ఓటు వాడికి హక్కు సాధించారన్నారు. కరోనా సమయములోనూ రాష్ట్రం ఆర్థికంగా ఎంత ఇబ్బంది పడినా సంక్షేమ పథకాలను అందించి పేదల బ్రతుకుకు భరోసా కల్పించారన్నారు. గత నాలుగున్నరేళ్లలో ఒకే ఒక్క బటన్ నొక్కి కోట్ల రూపాయల నిధులను నేరుగా లబ్దిదాల ఖాతాల్లోకి జమ చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. మహిళలు మీరు రానున్న ఎన్నికల్లో రెండే రెండు బటన్ లు ఒకటి ఎంపీ అభ్యర్థికి మరోది ఎమ్మెల్యేలకు నొక్కి ఇక్కడ నన్ను రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డిని గెలిపించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం పట్టణంలోని 702 సంఘాలలో 6936 మంది సభ్యులకు గాను రూ 5.68 కోట్లు, రూరల్ మండల పరిధిలోని 1318 సంఘాలకు చెందిన 12,859 మంది సభ్యులకు గాను రూ. 10.91 కోట్ల ఆసరా నమూనా చెక్కులను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుంటూరు ఏఎంసి చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ , వైఎస్ ఆర్ సిపి పట్టణ, రూరల్ పార్టీ కన్వీనర్లు, మునిసిపల్, మండల పరిషత్ ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు నాయకులు, వైఎస్ఆర్సిపి అనుబంధ సంఘాల బాధ్యులు, పొదుపు సంఘాల సభ్యులు తదితరులు ఉన్నారు.

## ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి



రెంటచింతల, మేజర్‌న్యూస్
ప్రతి భారతీయుడి హృదయంలో స్వదేశీ,స్వాభాష,స్వరాజ్ స్ఫూర్తిని నింపిన మహాత్మా గాంధీ జాతి హృదయాలలో అమరుడని,ఆర్యవైశ్య సంఘం మండల మాజీ అధ్యక్షుడు ఏచూరి వెంకట సైదయ్య అన్నారు. మంగళవారం రెంటచింతలలో మహాత్మా గాంధీ 76వ వర్ధంతి వేడుకలను రామాలయం సెంటర్లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ వర్ధంతిని అమరవీరుల సంస్మరణదినంగా పాటిస్తున్న సందర్భంగా దేశం కోసం మహోన్నత త్యాగాలు చేసిన దేశభక్తులను స్మరించుకోవడం బాధ్యత అన్నారు. మంచి నడవడి అలవర్చుకుని, మంచికి మద్దతు పలుకుతూ రామరాజ్య స్థాపనకు మన వంతు కృషి చేయడమే జాతిపితకు మనమిచ్చే ఘన నివాళియని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ సామాజిక సేవల్లో పేరొందిన మోహన్ రావు(గిరిజన పాఠశాల ప్రిన్సిపల్),బద్దూరి బ్రహ్మారెడ్డి (సత్రశాల ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్),కృష్ణమాచార్యులు(వేణుగోపాలస్వామి ఆలయం అర్చకులు), ఆధ్యాత్మిక సేవా రంగంలో పల్లెర్ల కోటిరెడ్డిలను వెంకట సైదయ్య దంపతులు శాలువాలు కప్పి సత్కరించి, 14 మంది గిరిజన పాఠశాల విద్యార్థులకు వారు టీ షర్టులు వితరణ చేశారు. కార్యక్రమంలో నారాయణపురం శ్రీనివాసరావు,కాశిరెడ్డి,నాళం పాండు, గాదె మల్రెడ్డి, కొత్త సాంబశివరావు, నేతాజీ, అన్నపురెడ్డి కృష్ణ, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా మహాత్మ గాంధీ వర్ధంతి

మాచర్ల టౌన్, మేజర్‌న్యూస్: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలో మంగళవారం ఘనంగా జరిగింది. పట్టణంలోని ప్రధాన సెంటర్లో గల మహాత్మాగాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాచర్ల మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కౌన్సిలర్ పట్టణ అధ్యక్షుడు పోలా శ్రీనివాసరావు, ఆర్యవైశ్య నాయకులు చిల్లంచర్ల సత్యనారాయణ మాట్లాడుతూ మన దేశ స్వాతంత్రం కోసం మహాత్మా గాంధీ ఎన్నో త్యాగాలను చేసి, బ్రిటిష్ వారి నుంచి మనకు విముక్తి కల్పించారని అన్నారు. కర్నూలు జిల్లా ఆదోనిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి కొందరు గుర్తు తెలియని దుండగులు పేడపూసి అవమానపరిచారని, పొట్టి శ్రీరాములు విగ్రహానికి పేడ పూయడం ఆర్యవైశ్యులకే కాదు రాష్ట్ర ప్రజానీకానికే అవమానకరమని, అటువంటి దుశ్చర్యకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మారం శ్రీనివాసరావు, గోపవరపు నాగేశ్వరరావు, అమర్ ,సురేష్ అంజి, రంగా చెన్నయ్య మారం రాముడు కొత్త మాసు వెంకటేశ్వర్లు సైదారావు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# నరసరావుపేటలో వైఎస్ఆర్ ఆసరా వేడుకలు





నరసరావుపేట, మేజర్‌న్యూస్
నరసరావుపేట నియోజకవర్గంలో పొదుపు సంఘాల మహిళలకు ఇచ్చిన హామీ మేరకు వరుసగా నాలుగో విడత ఆసరా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేశారు. ఈ నేపథ్యంలో నరసరావుపేట రూరల్ మండలం సంబంధించిన పొదుపు సంఘాల మహిళ లకు నాలుగో విడత ఆసరా సంబరాల కార్యక్రమాన్ని నరసరావుపేట పట్టణంలోని ప్రకాష్ నగర్ లోని టౌన్ హాల్ లో మెప్మా ఆధ్వర్యంలో పండుగ వాతావరణంలో నిర్వహి ంచారు. ఆసరా 4వ విడత సంబరాలకు స్థానిక పార్టీ నాయకులతో కలిసి నరసరా వుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజర య్యా రు. ఈ కార్యక్రమానికి వేలాదిగా హాజరైన పొదుపు మహిళలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను తూ.చా తప్పకుండా అమలు చేయడం జరిగిందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఎంత కష్టమైనా వారి ఆర్థిక తోడ్పాటుకు పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన ప్రతి మాటను తూ.చా తప్పకుండా గాలికి వదిలేసే అలవాటున్న వ్యక్తిఅని వ్యాఖ్యానించారు. అభివృద్ధి అంటే నాణ్యవంతమైన విద్య, వైద్యం తోపాటు ప్రతి ఇంటిలో ఆర్థిక తోడ్పాటు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదిశగానే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నేడు అన్ని సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేస్తూ వాటి ఫలాలను కూడా మహిళల ఖాతాల్లోకి జమ చేయడం జరుగుతుందని అన్నారు .ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా జరగడంలేదని ఆ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఇచ్చిన మాటను ఏ రోజు కూడా లిల్లి పెట్టకోవాలని వ్యక్తి చంద్రబాబు నాయుడు అని అటువంటి వారికి ఓటు వేస్తే ప్రజా అభివృద్ధి సంక్షేమ పథకాలన్నీ తెలుగుదేశం పార్టీ దళారుల చేతులకి వెళ్లడం ఖాయమని ఈ విషయాన్ని మహిళలందరూ ఒక్కసారి గమనించాలని సూచించారు. 4వ విడత ఆసరా సంబరాల్లో పాల్గొనేందుకు వేలాదిగా తరలివచ్చిన అశేష మహిళ సోదరీ సోదరీమణులను మనస్ఫూర్తిగా అభినం దిస్తున్నానని తెలిపారు..నరసరావుపేట రూరల్ మండలం పరిధిలో 1556 స్వయం సహాయక సంఘాలు వైయస్సార్ ఆసరా పథకాన్ని పొందుటకు అర్హత కలిగి స్వయం సహాయక సంఘాలలోని 15,560 మంది డ్వాక్రా మహిళలకు రూ. 11.75 కోట్ల విలువ చేసే ఆసరా నాలుగో విడత చెక్కు పంపిణీ చేశారు ఇప్పటివరకు నాలుగు విడతల్లో మొత్తం స్వయం సహాయక సంఘాలకు 47.02 కోట్ల స్వయం సహాయక సంఘాలకు జమ చెయ్యటమైనది అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు..ఈ కార్యక్రమంలో మెప్మా అధికా రులు, సీసీలు, నరసరావుపేట మండల నాయకులు, ఎంపీపీ, వైస్-ఎంపీపీ, జడ్పీటిసి, మండల కన్వీనర్, ఎంపీటీసీలు, సర్పం చులు, ఉప సర్పంచులు, డైరెక్టర్లు, సొసైటీ అధ్యక్షులు, సొసైటీ సభ్యులు, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, వివిధ కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ గృహసారథులు, సోషల్ మీడియా కన్వీనర్ లు, జగనన్న అభిమానులు మరియు వివిధ హోదాలలో ఉన్న నాయకులు, ఆర్పీలు, డ్వాక్రా మహి ళలు, వివిధ స్వయం సహాయక సంఘాలు, మహిళ అభిమానులు పాల్గొన్నారు.

## కృత్రిమ గర్భధారణ శ్రేయస్కరం



నూజెండ్ల మేజర్‌న్యూస్:
మండలంలోని చింతలచెరువు రైతు భరోసా కేంద్రం నందు పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం లేక దూడల ప్రదర్శన ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఈపూరు, వినుకొండ పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు పయ్యావుల శ్రీనివాసమూర్తి, బి.సరోజా దేవి హాజర య్యారు.ఈ సందర్భంగా పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ బి సరోజాదేవి మాట్లాడుతూ నేటి మేలు జాతి దూడలు రేపటి మేలుజాతి పాడి పశువులని ఇది గమనించి పాడి రైతులు దూడల పోషణ,వాటి యాజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.దూడలు పుట్టిన వెంటనే జాగ్రత్తలు పాటించి జున్నుపాలు సమృద్ధిగా తాగించాలని, పశు సంవర్ధక శాఖాధికారుల సూచనలమేరకు లేగ దూడల పెంపకంపై జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏడాదికి ఒక లేగ దూడను పుట్టించే విధంగా రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. గేదెలు గాని ఆవులు గాని ఎదలోకి వచ్చినప్పుడు కృత్రిమ గర్భాధారణ మాత్రమే చేయించాలని సూచించారు.ఈ కార్యక్రమానికి 55 మంది రైతులు 70 లేక దూడలు ప్రదర్శనలో పాల్గొనగా ఉత్తమంగా ఎంపిక చేసిన దూడలకు ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు పాల క్యాన్లను అందజేయడం జరిగింద న్నారు. అనంతరం ప్రదర్శనలో పాల్గొన్న రైతులకి సంజీవని టానిక్స్ క్యాల్షియం నులిపురుగుల మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నూజెండ్ల పసుపు వైద్యాధికారి డాక్టర్ డివి శివాజీ మొబైల్ వెటర్నరీ క్లినిక్ డాక్టర్ ఎం మనోజ్, వెటర్నరీ హనుమంత రావు, గ్రామ సర్పంచి రైతులు పసుపోషకులు పాల్గొన్నారు.

## మంగళగిరి లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్విమ్మింగ్ ఫూల్ , స్కేటింగ్ రింగ్ ప్రారంభోత్సవం

గుంటూరు, మేజర్‌న్యూస్
రాష్ట్రాన్ని క్రీడలలో అత్యున్నత స్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా సముదాయాలను ఏర్పాటు చేసి క్రీడాకారులకు ఉన్నతమైన శిక్షణ అందిస్తున్నారని రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో తెనాలి రోడ్డు ఆత్మకూరు సమీపంలో డాక్టర్ వైయస్. రాజశేఖర రెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రూ.8.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన షేక్. షంషేర్ ఖాన్ మెమోరియల్ స్విమ్మింగ్ ఫూల్, యంటీయంసీ స్కేటింగ్ రింగ్‌ను రాజ్యసభ సభ్యులు విజయ సాయి రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, శాసనమండలి సభ్యులు మురుగుడు హనుమంత రావుతో కలసి ప్రారంభించారు. ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించి క్రీడా సముదాయంలో దివంగత ముఖ్యమంత్రి వైయస్. రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. స్విమ్మింగ్ ఫూల్, స్కేటింగ్ రింగ్‌లో క్రీడలను లాంఛనంగా ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి మాట్లాడుతూ యువతకు, విద్యార్థులకు శారీరకధారుఢ్యం ఎంతో ముఖ్యమని, ప్రాచీన కాలం నుండి కూడా గురుకులాలలో సైతం విద్యార్థులకు విద్యతో పాటు శారీరకధారుఢ్యాన్ని పెంపొందించడానికి ప్రత్యేకంగా క్రీడలలో శిక్షణ ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం విద్యా సంస్థల్లోనూ విద్యార్థులకు ఫిజికల్ ఎడ్యుకేషన్ క్లాస్ లు నిర్వహిస్తున్నారని , ప్రత్యేకంగా కొన్ని రాష్ట్రాల్లో క్రీడా యూనివర్శిటీలు సైతం ఏర్పాటు చేశారన్నారు. ఇందులో ఖచ్చితంగా విజయం సాధిస్తామన్నారు. రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం , జీవన ప్రమాణాలు పెంచడానికి విద్య, వైద్యం, గృహ నిర్మాణ రంగాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. యంటీయంసీ త్రాగునీటి సరఫరాకు సంబంధించి రూ.1.9 కోట్లతో ఆధునీకరించిన పంప్ హౌస్ ను రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, శాసన మండలి సభ్యులు మురుగుడు హనుమంతరావు ప్రారంభించారు.

కార్యక్రమంలో యంటీయంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ , ఆప్కో ఛైర్మన్ గంజీ చిరంజీవి, యంటీయంసీ అదనపు కమిషనర్ ప్రకాష్‌రావు, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మద్యంపై యుద్ధం చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

### ఏపీ మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి మాజీ మున్సిపల్ కౌన్సిలర్ చెరుకుపల్లి నిర్మల



చిలకలూరిపేట, మేజర్‌న్యూస్:
రాష్ట్రంలో మద్యం ఏరులై ప్రవహిస్తుందని మద్యం వల్ల డెబ్బైశాతం కుటుంబాలు తీవ్ర దుర్భిక్షం పాలవడంతో పాటు అనారోగ్యాల బారిన పడుతున్నారని, తాగుడుకు బానిసై చిన్న వయసులోనే ఆరోగ్యాలు కోల్పోయి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, ఏపీ మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి మాజీ మున్సిపల్ కౌన్సిలర్ చెరుకుపల్లి నిర్మల తెలిపారు. ముందుగా గాంధీజీ వర్ధంతి సందర్భంగా గడియార స్తంభం సెంటర్లో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఆమె మాట్లాడుతూ చిన్న వయసులోనే మహిళలు భర్తను కోల్పోయి కుటుంబ పోషణ కోసం ఆర్థిక భారాన్ని పూర్తిగా మోయవలసి వస్తుందని, మద్యం వల్ల కుటుంబంలో, సమాజంలో హింసతో పాటు నేర ప్రవృత్తి పెరుగుతున్నదని, మద్యం వల్ల మహిళలు అనేక అనర్థాలను ఎదుర్కొంటున్నారని, మద్యనిషేధం కోసం మహిళలు నినదీస్తున్నారని అన్నారు. తాము అధికారంలోకి వస్తే మద్యాన్ని పూర్తిగా నిషేధిస్తామని నమ్మబలికి ఓట్లు గడించి గద్దెనెక్కిన ప్రభుత్వాలు ఏరు దాటిన తర్వాత తెప్పతగలేసిన చందంగా వ్యవహరిస్తున్నాయని ఎద్దేవా చేశారు. మద్యం అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం ప్రభుత్వ ఖజానా నింపుకోవడానికి ప్రధాన వనరుగా చూసుకుంటున్నాయి తప్ప, మద్య నియంత్రణకు ఆచరణలో చిత్తశుద్ధి లేదని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల ప్రణాళిక నవరత్నాలలో ఒకటిగా మద్యాన్ని కూడా చేర్చి రాష్ట్రంలో ఉన్న బెల్టు షాపులను మొత్తం రద్దు చేస్తామని, అప్పటికి రాష్ట్రంలో ఉన్న నాలుగువేల మూడువందల ఎనభైమూడు మద్యం షాపులో గాను సంవత్సరానికి ఇరవై శాతం చొప్పున ప్రతి సంవత్సరం మద్యం షాపులను ఎత్తివేస్తూ 2024 నాటికి రాష్ట్రంలో ఎక్కడ మద్యం షాపు అనేది లేకుండా చేస్తామని, ఫైవ్ స్టార్ హొటల్ కి పరిమితం చేస్తామని మహిళలకు హామీ ఇచ్చారని, ఇప్పటివరకు ఆ హామీ నెరవేర్చలేదని అన్నారు. కాబట్టి ఈనెల 31వ తేదీన విజయవాడలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మద్యంపై యుద్ధం అనే నినాదంతో చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నదని ఈ కార్యక్రమానికి చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొనవలసిందిగా ఆమె కోరారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు దుర్గ, ఏడుకొండలు,వెంకటేశ్వరమ్మ,కుమారి, బొడ్డు రమా దేవి పాల్గొన్నారు.

## గాంధేయ వాదం- కాంగ్రెస్ నాదం: నియోజకవర్గకాంగ్రెస్ పార్టీ



చిలకలూరిపేట, మేజర్ న్యూస్
పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్ర మంకు ముఖ్యఅతిథిగా చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం రాధాకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భం గా రాధాకృష్ణ మాట్లాడుతూ సత్యం అహింస లతో కూడిన సత్యాగ్రహం అనే బలమైన ఆయుధాన్ని రూపొందించి రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య వాదులను భారతదేశం నుండి తరిమి కొట్టిన నవ శక పురుషుడు మహాత్మా గాంధీజీ అని ఆయన అన్నారు. గాంధేయవాదమే కాంగ్రెస్ మూల సిద్ధాంతమని సమాజాన్ని శాంతి అహింసా మార్గంలో నడిపించడం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సాధ్యమని ఆయన తెలిపారు. తదుపరి జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుర్రా హనుమంతరావు మాట్లాడుతూ అత్యంత దుర్భరమైన బానిసత్వం నుండి దేశానికి స్వాతంత్రం తెచ్చిన అనితరసాధ్యుడు జాతిపిత మహాత్మా గాంధీజీ అని అన్నారు. లౌకికవాదం ప్రజాస్వామ్యం రాజ్యాంగ రక్షణ స్వేచ్ఛా భారతాన్ని మంచి మార్గంలో నడిపించే శక్తులని అన్నారు. గాంధీ చూపిన మార్గంలో నేటి యువత నడవటం ఎంతో ఆవశ్యక మని అన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి కుర్రా హనుమంతరావు, చేరెడ్డి శ్రీరామ రెడ్డి మిర్యాల వెంకటరత్నం దాసరి శ్యాంబాబు నటరాజు వెంకటేష్ తేవర్ లు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చేరెడ్డి శ్రీరామ్‌రెడ్డి, ఇంటూరి భవాని వెంకటేష్, యప్పాల అంజిరెడ్డి, మిరియాల వెంకటరత్నం, మంగళగిరి శ్రీనివాసరావు, దాసరి శ్యాంబాబు బాబు, పల్లె పోగు రాజు చిలకా నాగరాజు, కారుచోల స్వప్న కుమార్, షేక్ బాషా,షేక్ ఇమ్రాన్, కోవూరు రాజా, సాగి నరసింహారావు, షేక్ ఉమర్ అలీ, షేక్ సుభాని,జొన్నల రాజశేఖర్ రెడ్డి, చేరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,యం బాబు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించిన మల్లెల రాజేష్ నాయుడు



చిలకలూరిపేట, మేజర్‌న్యూస్
పట్టణంలోని బ్యాంకు కాలనీ నందు ఉన్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎన్నికల కార్యాలయంలో మంగళ వారం ఉదయం జాతిపిత మహాత్మ గాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు గాంధీజీ చిత్రపటా నికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజేష్ నాయుడు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో మహాత్మాగాంధీ బ్రిటీష్ వారిపై చేసిన శాంతియుత పోరాటం అందరికి ఆదర్శమైందని అన్నారు. ఆ మహనీయుని త్యాగాల వల్లనే నేడు భారతీయులందరూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవించగలుగుతు న్నారని ఆయన అన్నారు.గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకువెళ్తున్న వ్యక్తిగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ చరిత్రలో నిలిచిపోతారని ఆయన అన్నారు. గ్రామ స్వరాజ్యం సాధించే క్రమంలోనే గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాలను ఏర్పాటుచేసి రాష్ట్రంలో సుపరిపాలన సాగిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ ఛైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా అధ్యక్షులు తులా బంధుల మణిదీప్, పెన్నా సాంబశివ రావు, మారుబోయిన నాగరాజు, పంగులూరి వెంగళరాయుడు, యడ్లపాడు సొసైటీ ఛైర్మన్ బశల శివరామకృష్ణ, గణపవరం సొసైటీ అధ్యక్షులు మంగు ఏడుకొండలు, పదిహేన వ ఆర్థికసంఘం సభ్యులు కోటనాయాక్, విష్ణునాయక్, గుత్తి సింగయ్య, షేక్ మస్తాన్‌వలి, సాపా సైదావలి, ఉస్మాన్, అల్లాబక్షు, అల్లడి ఆదిబాబు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎంల అవగాహన కార్యక్రమంలో ముడేల



పిడుగురాళ్ల టౌన్, మేజర్ న్యూస్

రాష్ట్రంలో రానున్న ఎన్నికలను ఉద్దేశించి మండల పరిషత్ కార్యాలయంలో ఈవీఎం మిషన్లను సంబంధిత అధికారులకు, వివిధ పార్టీల నాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ఈవీఎంల అవగాహన అధికారి సంజీవ్ మాట్లాడుతూ ఓటింగ్ ప్రక్రియలో మూడు మిషన్లు ప్రధానంగా ఉంటాయని, మొదటిది ఈవీఎం అనగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్, ఎంతమంది అభ్యర్థులు పోటీ చేయుచున్నారో వాళ్లు ఎన్నికల గుర్తులతో వరస సంఖ్యలో ఒకటి నుంచి 16 వరకు ఉంటాయని, రెండవది వివి ఫాట్ అనగా ఓటరు వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రైల్ , దీని ద్వారా ప్రజలు వారు ఎవరికి ఓటు వేశారు డిస్ప్లే లో చూసుకోవడమే కాకుండా పేపర్ ద్వారా కూడా వారు ఎవరికి ఓటు వేశారో వీవీపీ ఏటీ లోపల భద్రంగా ఉంటాయని ఆ పేపర్లు తరువాత ఆడిట్లో లెక్కించటం జరుగుతుందని, మూడవది కంట్రోల్ యూనిట్ ప్రజలు వేసే ప్రతి ఒక్క ఓటు కంట్రోల్ యూనిట్ లో నమోదు అవటమే కాకుండా వాళ్ళు ఓటు వేసిన తరువాత బీప్ శబ్దం వస్తుందని, ఆ శబ్దం వచ్చాకే తదుపరి ఓటరు ఓటు వేయటానికి అవకాశం ఉంటుందని, ఎంతమంది ఓటు వేశారు కంట్రోల్ యూనిట్ ద్వారానే తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ వెంకటేశ్వర్లు, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ముడేల వెంకటేశ్వర రెడ్డి,వైస్ ఎంపీపీ సాతులూరు బాబు,ఎంపీటీసీ రామ కోటేశ్వరావు, కౌన్సిలర్ మాదల కిరణ్,పాత గణేశుని పాడు సర్పంచ్ ఏ సాంబశివరావు,మాజీసర్పంచ్ శ్రీను, తుమ్మలచెరువు సర్పంచ్ మేరీ కుమారీ,బీసీ సంఘం మండల అధ్యక్షులు యడవల్లి కొండలు, టిడిపి జిల్లా మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ అమీర్ ఆలీ, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి ఖాసిం సైదా,గుర్రం కోటేశ్వరరావు,రాయుడు ప్రసాద్,వాచర్బుడే పాల్గొన్నారు.

# నేడు గురజాలలో దూబచెరువు ప్రారంభోత్సవం

-2.5 కోట్ల రూపాయలతో సుందరీకరణ
- దుబాచెరువు చుట్టూ ఆహ్లాద వాతావరణం
- ఓపెన్ జిమ్, ప్లే ఏరియా, గ్రీనరీ ఏర్పాటు
- చైర్మన్ పట్టుదలతో శరవేగంగా పూర్తి
- నేడు ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మీదగా చేతుల ప్రారంభోత్సవం




గురజాల, మేజర్ న్యూస్ :

అది తొమ్మిది వందల సంవత్సరాల చరిత్ర కలిగిన చెరువు.... పల్నాటి పోరాట యోధురాలు నాయకురాలు నాగమ్మ ప్రజల దాహార్తి తీర్చేందుకు తవ్వించిన చెరువు.... కానీ గత తెలుగుదేశం ప్రభుత్వ అధికారంలో ఉన్న సమయంలో కొందరు నాయకుల స్వప్రయోజనాల కోసం మంచి నీటి చెరువులో చేపల పెంపకం చేసి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడారు. అది తెలుసుకున్న ప్రస్తుత శాసనసభ్యులు, అప్పటి గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కాసు మహేష్ రెడ్డి దూబచెరువును సందర్శించి మంచినీటి చెరువులో జరుగుతున్న అక్రమాలపై స్పందించారు. అధికారంలోకి వచ్చాక అభివృద్ధి చేసి చూపెడతామని హామీ ఇచ్చారు. నాయకులు హామీ ఇవ్వడం ఎన్నికల సమయంలో సహజమని... గెలిచాక ఎవరు ఏం చేయరూ...పట్టించుకోరు అనే ప్రజల విమర్శలకు చెక్ పెడుతూ అధికారంలోకి రాగానే దూబచెరువు అభివృద్ధిపై ఎమ్మెల్యే కాసు మహేష్రెడ్డి ఫోకస్ పెట్టారు. దోబచెరువు అభివృద్ధిపై అంచనాలు తయారు చేసి ఇవ్వండి అని నగర పంచాయతీ చైర్మన్ వీరారెడ్డికి బాధ్యతలు అప్పగించారు. చెరువు అభివృద్ధిపై బాధ్యతలు తీసుకున్న వీరారెడ్డి దానిలో ఉన్న లోపాలు చేయాల్సిన అభివృద్ధిపై ఉన్నతాధికారులతో మాట్లాడి పట్టుదలతో అంచనాలు తయారు చేయించారు. రాబోయే రోజుల్లో పెరుగుతున్న జనాభా కొనుగుణంగా ప్రజల దాహార్తిని తీర్చే విధంగా, ప్రజల ఆరోగ్యనిత్య గురజాల వాకింగ్ చేసుకునేందుకు ఎక్కడ స్థలం లేకపోవడంతో దూబచెరువును సుందరీకరంగా తీర్చిదిద్ది రోల్ మోడల్ గా నిలపాలని పట్టుదలతో పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభించిన రెండున్నర సంవత్సరాల కాలంలోనే సుందరీకరణ పనులు పూర్తి చేసి నేడు గురజాల శాసనసభ్యులు కావాల్సిన మహేష్రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు.

**వాకింగ్ ట్రాక్ అభివృద్ధి.....**

దూబ చెరువు చుట్టూ వాకింగ్ చేసుకునేందుకు వీలుగా అభివృద్ధి చేసి, చుట్టూ లైట్లు ఏర్పాటు చేశారు. అలాగే పిల్లలు వాడుకునే నీకు వీలుగా ఆట స్థలాన్ని, యువకులు జిమ్ చేసుకునేందుకు ఓపెన్ జిమ్ ను, ఆహ్లాదంగా ఉండేందుకు చుట్టు చెట్లను ఏర్పాటు చేశారు.

అలాగే ముఖద్వారాన్ని సుందరీకారంగా తయారు చేయించారు. మాటలకే పరిమితం కాకుండా అభివృద్ధి చేసి చూపించిన వైకాపా ప్రభుత్వాన్ని ప్రజలు ప్రశంసిస్తున్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేయాలని ఆకాంక్షిస్తున్నారు.

## విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి: వెంకటరామిరెడ్డి

మాచర్ల టౌన్, మేజర్న్యూస్:విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదిగి తల్లి దండ్రులకు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని వైయస్ఆర్సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని నరిశెట్టి కళ్యాణ మండపంలో కృష్ణవేణి జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిన్నెల్లి వెంకటరామిరెడ్డి హాజరై మాట్లాడారు. కృష్ణవేణి కళాశాలలో చదివిన ఎందరో విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని వారిని ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి రాణించాలని అన్నారు. సైకాలజీ ప్రొఫెసర్ సుగంధరరావు, పామూరు శ్రీనివాసరావు కళాశాల ప్రిన్సిపల్ వెంకట్రామయ్య కళాశాల అధ్యాపకులు శ్రీనివాసరావు, సుబ్బారావు, వేణు, లక్ష్మయ్య, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.




## వైసీపీ పాలనలో బీసీలకు అన్యాయం: జూలకంటి బ్రహ్మారెడ్డి



మాచర్ల, మేజర్న్యూస్:

వైసీపీ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మాచర్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మాచర్ల పట్టణ, రెంటచింతల మండలాల జయహో బీసీ సదస్సులో జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన రోజు నుండి రాష్ట్రంలో బీసీల మీద దాడులు పెరిగాయి అన్నారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామానికి చెందిన బీసీ నాయకుడు తోట చంద్రయ్య, దుర్గి మండలం జంగమేశ్వరపాడు గ్రామానికి చెందిన బీసీ నాయకుడు కంచర్ల జల్లయ్యను హతమార్చింది వైసీపీ నాయకులు కాదా అని ప్రశ్నించారు. అలాగే నిన్న మత్స్యకార కుటుంబానికి చెందిన బిసి తెలుగుదేశం పార్టీ కార్యకర్త దుర్గారావు బలవన్మరణానికి కారణం ఈ ప్రభుత్వం దౌర్జన్యం వల్లనే అని దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తిరిగి తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన వెంటనే బీసీల రక్షణకై ఒక చట్టం తెస్తున్నట్లు చంద్రబాబు నాయుడు ఇప్పటికే ప్రకటించారని, ప్రభుత్వం ఏర్పడిన వెంటనే దాన్ని అమలు పరుస్తామని బీసీలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు గుంటుపల్లి నాగేశ్వరరావు ,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు నల్ల మేకల వెంకటేశ్వర్లు, రాష్ట్ర బీసీ సెల్ జనరల్ సెక్రటరీ మద్దిరాల గంగాధర్, చంద్రశేఖర్, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రీ శివారెడ్డి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మున్నా రాంబాబు యాదవ్, పట్టణ అధ్యక్షులు కొమ్మెర దుర్గారావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బండారు కృష్ణవేణి ,పార్టీ సీనియర్ నాయకులు బాలశౌరి ,నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు వీరు, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు బాబు ఖాన్, సంబోజీ వేణు, గుండాల శ్రీనివాసరావు, బ్రహ్మయ్య, జానీ మైన పుల్లయ్య, అంజి ,మాజీ కౌన్సిలర్లు వెంకటేశ్వర్లు, చెన్నకేశవులు, లక్ష్మీనారాయణ, పాపమ్మ ,కృష్ణ ,జానయ్య, రామకృష్ణ ,మద్దీన్ లాలా, పలువురు తెలుగుదేశం, జనసేన పార్టీ బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పలువురు టిడిపిలో చేరిక**

కాపు జేఏసీ మాచర్ల నియోజకవర్గం అధ్యక్షుడు పసుపులేటి బ్రహ్మానాయుడు, గుండాల శ్రీనివాసరావు యాదవ్ ఆధ్వర్యంలో తాళ్లపల్లి గ్రామానికి చెందిన ఎస్టీ కుటుంబాల వారు వైసిపి పార్టీని వీడి మాచర్ల తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి సమక్షంలో మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పిసాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు.


విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య

అక్షరానికి నైతికతను అద్ది దేశవ్యాప్తంగా 23 ఎడిషన్లతో సామాజిక న్యాయం వైపు మళ్ళించే యజ్ఞం చేపట్టిన "నేటి దినపత్రిక సూర్య" అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ యజ్ఞంలో "నేటి దినపత్రిక సూర్య" అక్షర సైనికులను మరి కొంత మందిని నియమించుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పల్నాడు జిల్లాలో ఖాళీగా ఉన్న మండలాలకు విలేకరులు కావలెను. ఆసక్తిగల వారు ఈ నెల 31వ తేదీలోగా సంప్రదించగలరు.

చిలకలూరిపేట రూరల్, నాదెండ్ల, నరసరావుపేట రూరల్, నరసరావుపేట క్రైం, బెల్లంకొండ, ముప్పాళ్ళ, అచ్చంపేట, క్రోసూరు, అమరావతి, రొంపిచర్ల, నకరికల్లు

బి.నరసింహారావు, బ్యూరో ఇన్చార్జి
సెల్ : 98499 96624